సాక్షి
కర్నూలు
సోమవారం, 6, జనవరి, 2025



శ్రీమఠంలో భక్తుల రద్దీ

మంత్రాలయం: ఆదివారం సెలవు దినం కావడంతో శ్రీమఠానికి భక్తులు తరలివచ్చారు. గ్రామదేవత మంచాలమ్మ, రాఘవేంద్రుల స్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు.



అన్నప్రసాద పథకానికి విరాళం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి ఆదివారం హైదరాబాద్‌కు చెందిన కె.రవినాగ్ రూ.లక్ష విరాళం అందజేశారు.



మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్య కళావేదికపై ఆదివారం నందికొట్కూరుకు చెందిన లిక్షితా నృత్య కళాశాల వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజనల్, మునిసిపల్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టీబీ డ్యామ్‌కు నిలిచిన ఇన్‌ఫ్లో

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్‌లోని తుంగభద్ర జలాశయం (టీబీ డ్యాం)కు ఆదివారం ఇన్‌ఫ్లో నిలిచిపోయింది. నెల రోజులుగా ఇన్‌ఫ్లో తగ్గుతూ ఆదివారం జీరోకు పడిపోయింది. కాల్వలకు మాత్రం 8,578 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుతం డ్యాంలో 1,625 అడుగులతో 77 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి 1,589 అడుగుల వద్ద కేవలం 10 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఈ ఏడాది రబీలో వరి, ఇతర పంటలు సాగు చేస్తున్నారు. ఇక జిల్లాలో ప్రవహించే దిగువ కాలువ (ఎల్లెల్సీకి) 250 కి.మీ వద్ద 447 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

ఆదోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిశీలన

ఆదోని అర్బన్: నకిలీ మరణ ధ్రువీకరణ పత్రంతో రూ. కోట్ల విలువైన స్థలం రిజిస్టర్ జరిగిన ఆదోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి చెన్నకేశవరెడ్డి ఆదివారం పరిశీలించారు. బతికున్న ఎగ్గటి ఈశ్వరప్ప పేరుపై నకిలీ మరణ సర్టిఫికెట్, ఫ్యామిలీ సర్టిఫికెట్‌తో అముదాల భాస్కర్ అనే వ్యక్తి రూ.35 కోట్లు విలువ చేసే 6.51 ఎకరాల భూమిని అక్రమంగా రిజిస్టర్ చేసుకున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ మేరకు జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి చెన్నకేశవ రెడ్డి కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి ఆ రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన వివరాలను సేకరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ కేసు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, వారి ఆదేశాల మేరకు ఆదోని సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయంలోని రిజిస్టర్, సిబ్బందిపై చర్యలు ఉంటాయన్నారు.

శ్రీశైలం నుంచి 8,908 క్యూసెక్కుల నీరు విడుదల

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల జలాశయం ద్వారా శనివారం నుంచి ఆదివారం వరకు 8,908 క్యూసెక్కుల నీరు దిగువ ప్రాజెక్ట్‌లకు వదిలారు. నాగార్జునసాగర్‌కు 2,918 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 , హంద్రీనీవా సుజల స్రవంతికి 1,600, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 490, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 1,500 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో 1.511 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.

ఏప్రిల్ 1న కేంద్రీయ విద్యాలయం ప్రారంభం

డోన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన కేంద్రీయ విద్యాలయం ఏప్రిల్ 1న ప్రారంభం కానుంది. ఈమేరకు కేంద్రీయ విద్యాలయాల డిప్యూటీ కమిషనర్ డాక్టర్ మంజునాథ్ నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియాకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో డోన్‌లోని ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో విద్యార్థుల వసతి కోసం నిర్మించిన అత్యాధునిక భవనంలో ప్రస్తుతం కేంద్రీయ విద్యాలయం నిర్వహణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గతేడాది ఈ భవనాన్ని కేంద్ర మానవ వనరుల శాఖకు చెందిన అధికారుల బృందం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు అత్యంత అనువైనదిగా కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసిన విషయం తెలిసిందే.



కొత్తపల్లి మండలం గువ్వలకుంట్ల నుంచి బయలుదేరుతున్న వలస కూలీలు



పిల్లలతో పాటు వలసబాట



కృష్ణగిరి మండలం నుంచి బొలేరో వాహనంలో బయలుదేరుతున్న కూలీలు

పల్లెలు ఖాళీ అవుతున్నాయ్!

వలసలు ఆగడం లేదు. పల్లెలు ఖాళీ అవుతున్నాయి. ఉపాధి పనులు కల్పించకపోవడంతో వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. గ్రామాల్లో దండోరాలు వేయించి పనులు కల్పిస్తున్నామని అధికారులు చెబుతున్నారే కానీ క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి శని, ఆది వారాల్లో దాదాపు 2,500 మందికి పైగా వలస కూలీలు గుంటూరుకు పొట్టచేత పట్టుకుని బయలుదేరారు. కొత్తపల్లి మండలం వీరాపురం, సింగరాజుపల్లె, ముసలిమడుగు, గువ్వలకుంట్ల, కొత్తపల్లితోపాటు అన్ని గ్రామాల నుంచి వలస వెళ్లారు. కృష్ణగిరి మండల పరిధిలోని పెనుమాడ గ్రామం నుంచి 40 కుటుంబాలు గుంటూరుకు వలస వెళాయి. మూటాముల్లె సర్దుకుని విద్యార్థులను బడి మానిపించి వారి వెంట తీసుకెళ్లారు. – కొత్తపల్లి/కృష్ణగిరి



ఈ చిత్రంలో ఉన్న మహిళ పేరు షేక్ బడేబీ. కర్నూలు బుధవారపేటకు చెందిన ఈ మహిళ వయస్సు 64 ఏళ్లు. పింఛన్‌దారుడైన ఈమె భర్త చాంద్‌బాషా గత ఏడాది ఫిబ్రవరిలో మృతిచెందారు. వితంతు పింఛన్ కోసం ఈమె దరఖాస్తు చేసుకుంది. అయితే కరెంటు బిల్లు ఎక్కువగా వస్తుందని, ప్లాట్ ఉందంటూ ఆమె దరఖాస్తును రిజెక్ట్ చేశారు. దీంతో పింఛన్ వస్తుందో.. లేదోనని ఆమె ఆందోళన చెందుతోంది.

.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇలాంటి వారు చాలా మంది ఉన్నారు.


అంతా వంచన

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామంటూ ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 50 ఏళ్ల బీసీ, ఎస్టీ, ఎస్సీ, ముస్లింలు 2 లక్షల మందికిపైగా ఉండగా... వీరిలో కనీసం లక్ష మంది అర్హులు ఉంటారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలు పూర్తవుతున్నా హామీ అమలు కాకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. ప్రతి వారం కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండలాల్లో జరిగే గ్రీవెన్స్‌కు వెళ్లి కొత్త పింఛన్ల కోసం వినతులు ఇస్తున్నారు.

దురుద్దేశంతోనే..



దివ్యాంగుల పింఛన్ల తొలగింపునకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. అర్హతే ప్రామాణికంగా తీసుకొని గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసింది. నేడు రాజకీయ దురుద్దేశంతో కూటమి ప్రభుత్వం పింఛన్లు తొలగించేందుకు చర్యలు తీసుకోవడం దారుణం. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలైనప్పటికీ ఒక్క కొత్త పింఛన్ కూడా ఇవ్వలేదు. చాలా దారుణంగా పాలన సాగిస్తున్నారు.
– వి.రామాంజనేయులు, వికలాంగుల సమాఖ్య అధ్యక్షుడు, ఆలూరు మండలం



కుట్ర కనిపింఛన్!

హెల్త్, దివ్యాంగ పింఛన్ లబ్ధిదారుల వివరాలు..

జిల్లా	హెల్త్ పింఛన్లు	దివ్యాంగ పింఛన్లు	మొత్తం
కర్నూలు	227	186	413
నంద్యాల	672	201	873
మొత్తం	899	387	1,286

సామాజిక భద్రత పింఛన్లు తొలగించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దివ్యాంగ, హెల్త్ పింఛన్లలో కోత వేసేందుకు పరిశీలనకు ఆదేశాలు జారీ చేసింది. ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించేందుకు అనంతపురం జిల్లా నుంచి వైద్యులను పంపుతోంది. ఈ విషయం తెలియడంతో దివ్యాంగ, హెల్త్ పింఛన్లు అందుకుంటున్న వారిలో ఆందోళన నెలకొంది.

- నేటి నుంచి దివ్యాంగ, హెల్త్ పింఛన్ల పరిశీలన
- అనంతపురం జిల్లా నుంచి రానున్న వైద్యులు
- ఇప్పటి వరకు కొత్త పింఛన్లు ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం
- పింఛన్ లబ్ధిదారుల తొలగింపునకు అత్యుత్సాహం
- గత నెల ఉమ్మడి జిల్లాలోని రెండు సచివాలయాల్లో పరిశీలన
- లబ్ధిదారులకు మిగిలింది మానసిక వేదనే!

కర్నూలు(అగ్రికల్చర్): పక్షవాతం, కండరాల బలహీనత(క్షీణత)తో మంచానికి పరిమితమైన వారు, రోడ్డు ప్రమాదాల్లో కాళ్లు, చేతులు పోగొట్టుకున్న బాధితులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. ఎలాంటి రాజకీయ సిఫార్సులకు అవకాశం లేకుండా, అర్హతే ప్రామాణికంగా పింఛన్లు అందించి ఔదార్యం చూపింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం దివ్యాంగ, హెల్త్ పింఛన్లు తొలగించడమే లక్ష్యంగా పెట్టుకుంది. పింఛన్ లబ్ధిదారుల్లో అనర్హులు ఉన్నారని టీడీపీ నేతలతోపాటు 'పచ్చ' మీడియా సైతం ప్రచారం చేస్తోంది. డిసెంబరు 9న జిల్లాకు ఒక సచివాలయం పరిధిలోని మొత్తం పింఛన్లను పరిశీలన చేయించి.. రాష్ట్రం మొత్తం మీద 5 శాతం(580) పింఛన్ లబ్ధిదారులకు అర్హత లేదని చెప్పించింది. వీరికి నోటీసులు ఇవ్వాలని, సమాధానం వచ్చిన తర్వాత తొలగించాలని ప్రభుత్వం మొదట నిర్ణయించి చివరి క్షణాల్లో వెనక్కి తీసుకుంది. తాజాగా దివ్యాంగ, హెల్త్ పింఛన్ల తొలగింపు కోసమే పరిశీలన జరపనున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

నేటి నుంచి పరిశీలన

కర్నూలు జిల్లాలో 413, నంద్యాల జిల్లాలో 873 ప్రకారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,286 ఎన్టీఆర్ భరోసా పింఛన్లను రీ- అసెస్‌మెంట్ చేయనున్నారు. ఇందుకోసం కర్నూలు జిల్లాకు మూడు, నంద్యాల జిల్లాకు మూడు బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి బృందంలో ఇద్దరు వైద్య నిపుణులు ఉంటారు. అనంతపురం జిల్లా నుంచి కర్నూలు జిల్లాకు ఆరుగురు, నంద్యాల జిల్లాకు ఆరుగురు వైద్యులు రానున్నారు. పక్షవాతంతో రూ.15 వేలు పింఛన్ పొందుతున్న వారు ప్రస్తుతం వీల్‌చైర్ మీద ఉన్నారా... బెడ్‌పై ఉన్నారా అనే దానిని ఈ వైద్యులు పరిశీలించనున్నారు. పక్షవాతంతో పింఛన్ అందుకుంటున్న వారు నంద్యాల జిల్లాలో 672, కర్నూలు జిల్లాలో 227 మంది ఉన్నారు. అదేవిధంగా కండరాల బలహీనత(క్షీణత), రోడ్డు ప్రమాదాల్లో కాళ్లు, చేతులు పోగొట్టుకున్న బాధితులను కూడా డాక్టర్ల బృందం పరిశీలిస్తుంది. ఇటువంటి పింఛన్లు అందుకుంటున్న వారు కర్నూలు జిల్లాలో 186, నంద్యాల జిల్లాలో 201 మంది ఉన్నారు. కూటమి ప్రభుత్వ చర్యలతో పింఛన్ లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. తమ పింఛన్ ఉంటుందో.. ఊడుతుందోనన్న భయం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

11,460 పింఛన్ల తొలగింపు...

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ ఏడాది జూన్ నెలతో పోలిస్తే జనవరి నెల వరకు పింఛన్లను అడ్డుగోలుగా తొలగించారు. టీడీపీ నేతలు ఫిర్యాదు చేస్తే చాలు వెనువెంటనే నోటీసులు ఇచ్చి పింఛన్లు తొలగించడం సర్వసాధారణం అయ్యింది. గత ఏడాది జూన్ నెలలో ఉమ్మడి జిల్లాలో 4,67,389 పింఛన్లు ఉండగా.. డిసెంబరు నాటికి 4,55,929కు తగ్గాయి. అంటే 11,460 పింఛన్లను గుట్టుచప్పుడు కాకుండా తొలగించారు. గత నెలలో కర్నూలు జిల్లా ఎరుకల చెరువు, నంద్యాల జిల్లా కానాల-2 సచివాలయం పరిధిల్లో డోర్‌టుడోర్ పింఛన్లను పరిశీలించగా ఎలాంటి అనర్హులు లేరని తేలింది.

16 రోజుల పాటు పరిశీలన



హెల్త్, దివ్యాంగుల పింఛన్ల పరిశీలన కార్యక్రమం ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభమై 16 రోజుల పాటు జరుగుతుంది. రోజుకు 15 నుంచి 25 ఇళ్లకు వెళ్లి వెరిఫికేషన్ చేస్తారు. వివరాలు మొబైల్ యాప్‌లో నమోదు చేస్తారు. ఇందుకోసం వైద్య నిపుణులతో జిల్లాకు మూడు టీమ్‌లు ఏర్పాటు చేశాం. అనంతపురం జిల్లాకు చెందిన ఆర్థోపెడిక్ సర్జన్‌లు, జనరల్ మెడిసిన్ వైద్యులు వస్తున్నారు.
– నాగశివలీల, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్, కర్నూలు

పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో కమిటీ

హెల్త్, దివ్యాంగ పింఛన్ల రీ వెరిఫికేషన్, రీ అనాలసిస్‌ను పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీ ఏర్పాటైంది. అనర్హులని తేలితే ఈ కమిటీనే నోటీసులు ఇస్తుంది. నోటీసులకు జవాబులు వచ్చిన తర్వాత వాటిని ఈ కమిటీ పరిశీలించి ఏరివేత నిర్ణయం తీసుకుంటుంది. చైర్మన్‌గా జిల్లా కలెక్టర్. కన్వీనర్‌గా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్, సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్, డీఎంహెచ్‌ఓ, డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్ హాస్పిటల్ సర్వీస్, జిల్లా కుష్ఠు నివారణ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, జెడ్పీ సీఈఓ, జీఎస్‌డబ్ల్యూఎస్ డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు అధికారులు సభ్యులు ఉంటారు. రీవెఫికేషన్ వివరాలను సంబంధిత టీమ్ లీడర్లు మొబైల్ యాప్‌లో నమోదు చేస్తారు.

నయా మోసం

- రూ. 3.24 లక్షలు డిపాజిట్ చేసినట్లు సైబర్ నేరగాళ్ల బురిడీ
- అకౌంట్‌ను హ్యాక్ చేసి డబ్బులు కాజేసే యత్నం



బ్యాలెన్స్ రూ. 3.24 లక్షలు చూపిస్తున్న దృశ్యం

గడివేముల: సైబర్ నేరగాళ్లు రోజురోజుకు కొత్త తరహాలో మోసాలకు పాల్పడుతున్నారు. సెకన్ల వ్యవధిలో ప్రజల డబ్బును దోచుకునేందుకు ఏమార్చుతున్నారు. తాజాగా యూపీఏ యూజర్లే లక్ష్యంగా జంప్డ్ డిపాజిట్ స్కామ్‌కు పాల్పడుతున్నారు. మండల కేంద్రమైన గడివేముల గ్రామానికి చెందిన పరమేష్ గౌడ్ అకౌంట్‌కు రూ.3.24 లక్షలు జమ అయినట్లు ఆదివారం ఫోన్‌కు మేసేజ్ వచ్చింది. డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయని బ్యాలెన్స్ చెక్ చేసుకోగా అదే మొత్తం కనిపించింది. అయితే ఆ అమౌంట్‌ను ఇతరులకు ట్రాన్స్‌ఫర్ చేస్తుంటే పోవడం లేదు. అనుమానంతో ఆన్‌లైన్‌లో చూస్తే తన అకౌంట్‌లో జీరో కనిపిస్తోంది. ఉండాల్సిన రూ.1,600 కూడా లేదు. ఎవరైనా తన అకౌంట్‌కు నగదు ట్రాన్స్‌ఫర్ చేస్తే క్షణాల్లో మాయమవుతోంది. తన అకౌంట్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారని పసిగట్టి అకౌంట్‌కు ఎవరూ డబ్బులు పంపకుండా జాగ్రత్త పడ్డాడు.

ఎన్‌టీఆర్ వైద్యసేవల్లో ఓపీ బంద్

- ఈహెచ్‌ఎస్‌లో ఓపీ, ఐపీ కూడా నిలుపుదల
- నేటి నుంచి నిరసన తెలపనున్న ఆసుపత్రులు

కర్నూలు(హాస్పిటల్): పేదలకు ఆరోగ్యభరోసానిచ్చే ఎన్‌టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ)కి బ్రేక్ పడనుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నెట్‌వర్క్ ఆసుపత్రులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3వేల కోట్లకు పైగా బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో ఆయా ఆసుపత్రులు నిరసన తెలిపేందుకు సిద్ధమయ్యాయి. ఈ మేరకు ఈ నెల 6వ తేదీ నుంచి ఎన్‌టీఆర్ వైద్యసేవ(ఆరోగ్యశ్రీ)లో ఓపీ సేవలు, ఎంప్లాయ్ హెల్త్ స్కీమ్(ఈహెచ్‌ఎస్) పథకంలో ఓపీతో పాటు ఐపీ సేవలు కూడా నిలిపివేయాలని నిర్ణయించాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు కలిపి 229 (కర్నూలు 128, నంద్యాల 101) నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రులు మినహా ప్రైవేటు, కార్పొరేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో వైద్యసేవ ఓపీ సేవలు, ఈహెచ్‌ఎస్ ఓపీతో పాటు ఐపీ సేవలు నిలిచిపోనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందన్న అనుమానాలు వ్యక్తం అయ్యాయి. అనుకున్నట్లుగానే ఈ పథకాన్ని అటకెక్కించి దాని స్థానంలో ఏప్రిల్ నుంచి బీమా పథకాన్ని అమలులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు ప్రారంభించినట్లు స్వయానా ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధి విధానాలు కూడా ఆయన చూచాయగా గతంలోనే వెల్లడించారు. బీమా కంపెనీలచే రూ.2.5లక్షల వరకు క్లెయిమ్ అవుతుందని, ఆ పైన ఉంటే ఎన్‌టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ భరిస్తుందని చెప్పారు. అయితే నెట్‌వర్క్ ఆసుపత్రుల గురించి ఆయన వివరించలేదు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు ఏఏ వ్యాధికి ఎంత మొత్తం క్లెయిమ్ చేస్తారో చెప్పలేదు. ఈ విషయం గురించి అస్సలు నెట్‌వర్క్ ఆసుపత్రులతో చర్చించనూ లేదు. దీనికితోడు రాష్ట్ర వ్యాప్తంగా ఆసుపత్రులకు బకాయి పడ్డ రూ.3వేల గురించి ఎలాంటి ప్రకటనా చేయలేదు. బకాయిలు విడుదల చేయాలని ఆసుపత్రులు విన్నవించినా చెవిన వేసుకోలేదు.

నిర్వహణ భారమై..

వైద్యసేవకు సంబంధించి తమ బకాయిలు పెరిగిపోతున్నందున ఆసుపత్రుల నిర్వహణ కష్టంగా మారిందని యాజమాన్యాలు చెబుతున్నాయి. మందులు, సర్జికల్స్, వైద్యపరికరాల కొనుగోలుకు సంబంధించి ఏజెన్సీలకు అప్పులు పెరిగిపోయాయని, కొన్ని ఏజెన్సీలు వాటిని సరఫరా చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. 'వైద్యులు సైతం క్లెయిమ్‌ల సంగతి మాకు చెప్పవద్దు, అవి ఎప్పుడు వచ్చినా మీరే తీసుకోండి, ముందు మా సేవలకు డబ్బు వెంటనే ఇచ్చేయాలి' అని ఒత్తిడి చేస్తున్నారని, డబ్బు ఇవ్వకపోతే డాక్టర్లు కూడా రావడం లేదని ఆయా ఆసుపత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తప్పనిసరి పరిస్థితుల్లో సోమవారం నుంచి సేవలు నిలిపివేయాల్సి వస్తోందని నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు చెబుతున్నాయి.

ఇస్తెమాకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి ఆత్మకూరు శివారులో మూడురోజుల పాటు ధార్మిక సమ్మేళనం
- తరలిరానున్న లక్షలాది ముస్లింలు

ఆత్మకూరు: పట్టణ శివారులో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ఇస్తెమా జరుగనుంది. ఈ ధార్మిక సమ్మేళనానికి ఉమ్మడి కర్నూలు జిల్లా, వైఎస్సార్ జిల్లాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ముస్లింలు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఆత్మకూరు నుంచి శ్రీశైలం వెళ్లే దారిలో దాదాపు 300 ఎకరాల్లో ఇస్తెమా నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. గత కొద్ది రోజులుగా వివిధ ప్రాంతాల నుంచి ముస్లింలు స్వచ్ఛందంగా వాహనాల్లో తరలివచ్చి మైదానం చదును, పరిసరాల పరిశుభ్రత, చలువ పందిళ్ల ఏర్పాటు తదితర పనుల్లో పాలుపంచుకుంటున్నారు. అలాగే విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా తదితర సౌకర్యాల కల్పన పనులు తుదిదశకు చేరాయి. ఈ సమ్మేళనలో మత గురువులు ఇస్లాం ధర్మం సందేశం ఇవ్వనున్నారు. కాగా ఇస్తెమా కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు ఆ కమిటీ సభ్యులు రజాక్ వెల్లడించారు. శాంతి భద్రతలతో పాటు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ రామాంజినాయక్ తెలిపారు.



ఇస్తెమా ఆవరణలో ఏర్పాటు చేసిన కుళాయిలు



జిల్లాల వారీగా ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు



అయ్యో పాపం

చంటి బిడ్డను ఎత్తుకున్న ఆమె పేరు నాగేంద్రమ్మ. ఊరు ఆదోని మండలం పెద్ద తుంబళం. రేషన్ డీలర్ల ఎంపిక పరీక్ష రాసేందుకు ఆదివారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చేరుకుంది. అయితే అప్పటికే 15 నిమిషాలు ఆలస్యం కావడంతో అధికారులు ఆమెను లోపలికి అనుమతించ లేదు. తన మామయ్య చనిపోయాడని, అందుకే ఆలస్యమైందని, పరీక్ష రాసేందుకు అనుమతి ఇవ్వాలని అధికారులను వేడుకున్నా.. ఎవరూ కరుణించలేదు. దీంతో ఏడాది చంటి పిల్లాడితో నిరాశగా అక్కడి నుంచి ఆమె వెళ్లిపోయింది. అధికారులు ఆమె పరిస్థితిని అర్థం చేసుకుని అవకాశం ఇచ్చి బాగుండేదని అక్కడ ఉన్న వారు చర్చించుకున్నారు.
– ఆదోని రూరల్

'చలి'ంచని భక్తి

గర్భగుడిపై మంచు దుప్పటి



మంచులోనే దర్శనానికి..



గజ గజ చలి వణికించినా భక్తి తొణకలేదు. మూడు రోజులుగా నల్లమలను మంచు దుప్పటి కప్పేసింది. శ్రీశైల ఆలయం, సున్నిపెంట, డ్యాం వద్ద చలి తీవ్రత పెరిగింది. సాయంత్రం 5 గంటల నుంచే చలి గాలులు వీస్తున్నాయి. అలాగే ఉదయం 9 గంటల వరకు కూడా పొగమంచు వీడటం లేదు. అయినా భక్తులు వెనుకడుగు వేయడం లేదు. తెల్లవారుజాము నుంచే పుణ్యస్నానాలు ఆచరించి మల్లన్న దర్శనానికి చేరుకుంటున్నారు. ఓ వైపు ఆధ్యాత్మిక భావనలో తరిస్తూ.. మరో వైపు మంచు అందాలను తిలకిస్తూ మైమరిచిపోతున్నారు. – శ్రీశైలంటెంపుల్

క్లుప్తంగా

ఆయిల్ ట్యాంకర్ బోల్తా

పాణ్యం: మండల పరిధిలోని సిమెంట్‌నగర్ ఘాట్‌లోని కొండపై నుంచి ఆయిల్ ట్యాంకర్ బోల్తాపడింది. ఈఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. హైవే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం తెల్లవారుజామున గుంతకల్లు నుంచి ఆత్మకూరుకు ఆయిల్ (బీటీ రోడ్డుకు ఉపయోగించే తారు ఆయిల్) ట్యాంకర్ బయలుదేరింది. మార్గమధ్యంలో సిమెంట్ నగర్ ఘాట్‌లోని మలుపుల వద్ద అదుపుతప్పి కొండపై నుంచి బోల్తా పడింది. ఈ ఘటనలో ట్యాంకర్‌లో ఉన్న గుంతకల్లుకు చెందిన శ్రీనాథ్, షేక్ జాఫర్ గాయాలయ్యాయి. ఇరువురిని చికిత్స నిమిత్తం శాంతిరామ్ ఆసుపత్రికి తరలించారు. కాగా కొండపై నుంచి ట్యాంకర్ కింద పడటంతో పూర్తిగా ధ్వంసమైంది.

పూరిగుడిసెలు దగ్ధం

పాములపాడు: మండలంలోని లింగాల గ్రామంలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నాలుగు పూరి గుడిసెలు దగ్ధమయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మాదిగ నాగన్న , అతని కుమారులు స్వాములు, నాగేష్, చిన్నస్వామన్నకు చెందిన 4 పూరిగుడిసెలు వరుసగా ఉన్నాయి. కోతులు విద్యుత్ తీగలపై తిరగడంతో ఒకదాని కొకటి తాకి నిప్పురవ్వలు ఎగిసి నాగన్న ఇంటి పై పడ్డాయి. దీంతో గుడిసె అంటుకొని మంటలు క్రమంగా పక్కనున్న వాటికి వ్యాపించాయి. గమనించి ఆర్పేందుకు ప్రయత్నించారు.వీలుకాకపోవడంతో అగ్నిమాపక సిబ్బదికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలను ఆర్పేలోపే నాలుగు గుడిసెల్లోని నిత్యావసర వస్తువులు, దాచుకున్న నగదు పూర్తిగా కాలిబూడిదైంది. మొత్తం రూ. 4లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని, కట్టు బట్టలు మినహా ఏమి మిగలలేదని ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధితులు కోరారు.

పీడీఎఫ్ విలేకరిపై కేసు

ఆదోని అర్బన్: 'జాతీయ వార్త' విలేకరినంటూ తనను బెదిరించాడని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ మెంబర్ రవికుమార్ ఫిర్యాదు మేరకు నరసింహులు అనే పీడీఎఫ్ పేపర్ విలేకరిపై కేసు నమోదు చేసినట్లు ఆదోని త్రీటౌన్ సీఐ రామలింగమయ్య ఆదివారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ మెంబర్ నుంచి తనను తొలగించేలా సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తానని, లేకపోతే డబ్బులు ఇవ్వాలని బెదిరించాడని రవికుమార్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నరసింహులుపై కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ కారు ఎవరిదో ?


ప్రమాదానికి గురైన ఇన్నోవా కారు

పాములపాడు: మండల కేంద్రంలో పాల డెయిరీ సమీపంలో ఆదివారం తెల్లవారు జామున ఏపీ01 ఏజే 0005 నంబరు గల ఇన్నోవా కారు ప్రమాదానికి గురైంది. వేగంగా వచ్చి రోడ్డు పక్కనున్న స్తంభాన్ని ఢీ కొంది. తర్వాత ఆ కారును అలాగే వదిలేసి వెళ్లారు. ఎవరిదన్నది పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వలేదు. కారు నిలిపిన విధానం బట్టి ఆత్మకూరు వైపు నుంచి కర్నూలు వైపు వెళ్తున్నట్లుంది. ప్రమాద సమయంలో కారులో ఎంతమంది ఉన్నారు. వారికేమైనా గాయాలయ్యాయా తదితర విషయాలు తెలియాల్సి ఉంది.

శ్రమైక జీవనం

ఆరుగాలం కష్టించి పండించిన వరి పంట నూర్పిళ్లు మొదలయ్యాయి. కోడుమూరు, ఎమ్మిగనూరు నియోజకవర్గాల పరిధిలోని ఈర్లదిన్నె, నాగులదిన్నె, నందవరంతో పాటు సమీప గ్రామాల్లో రైతులు, కూలీలు వరి కోత కోసి, ధాన్యాన్ని రాశులు పోస్తున్నారు. పశుగ్రాసాన్ని ట్రాక్టర్లలో తీసుకెళుతున్నారు. పండించిన పంటను నూర్పిడి చేస్తున్నారు. గింజగింజలో రైతు కష్టం కనిపిస్తోంది. తుంగభద్ర తీరాన పల్లెల్లో ఈ దృశ్యాలు శ్రమైక జీవనాన్ని ప్రతిబింబించాయి.

– డి. హుస్సేన్, సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


వరి గడ్డిని కుప్ప చేస్తున్న కూలీలు


పొలంలోనే పంట నూర్పిడి చేస్తున్న దృశ్యం


జీవాలను ఇంటికి తోలుకొస్తున్న కాపరులు


వడ్లను ట్రాక్టర్‌తో కుప్ప చేస్తున్న డ్రైవర్


ధాన్యాన్ని రాశిగా పోస్తున్న రైతు


లారీకి వడ్ల బస్తాలను లోడ్ చేస్తూ..

మధ్యవర్తులను నమ్మి మోసపోకండి

- కురువ వివాహ పరిచయ వేదికలో వక్తలు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు సిట్రా సత్యనారాయణమ్మ

కర్నూలు(అర్బన్): పిల్లల వివాహ విషయాల్లో తల్లిదండ్రులు మధ్యవర్తులను నమ్మి మోసపోరాదని కురువ సంఘం నేతలు సూచించారు. ఆదివారం స్థానిక ఎంపీపీ సమావేశ భవనంలో జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో వివాహ పరిచయ వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, ఎంకే రంగస్వామి, అసోసియేట్ అధ్యక్షులు గుడిసె శివన్న, వైఎస్సార్‌సీపీ నాయకురాలు, కార్పొరేటర్ సిట్రా సత్యనారాయణమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పిల్లల వివాహాలు చేయాలనుకున్న వారు సంఘం నిర్వహించే వివాహ పరిచయ వేదికల్లో పాల్గొని నచ్చిన సంబంధాలు ఉంటే కుదుర్చుకోవాలన్నారు. అందరూ ఒకే వేదిక మీద కలుస్తున్న నేపథ్యంలో కులం, కట్టుబాట్లు, ఆచార సంప్రదాయాలు, తదితర పలు విషయాలపై మనసు విప్పి మాట్లాడుకునే అవకాశం ఉంటుందన్నారు. మధ్యవర్తులు తమ కమిషన్ల కోసం ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు చెప్పి మోసం చేసే అవకాశాలు ఉంటాయన్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలోని కర్నూలు, వైఎస్సార్ కడప, ఏలూరు, అనంతపురం తదితర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో కురువ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు హాజరయ్యారు. కార్యక్రమంలో కురువ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు కే కిష్టన్న, ఉపాధ్యక్షులు కత్తి శంకర్, నాయకులు ధనుంజయ, కొత్తపల్లి దేవేంద్ర, కేసీ నాగన్న, పాల సుంకన్న, చంద్రశేఖర్, తిరుపాలు, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు సంరక్షణకే ప్రాధాన్యం

- బీపీ, షుగర్‌ను నియంత్రిస్తే దుష్ఫలితాల నియంత్రణ
- ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసాదాలపై ప్రత్యేక దృష్టి
- డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ


డాక్టర్ శాంతికళ, డీఎంహెచ్‌ఓ, కర్నూలు

కర్నూలు(హాస్పిటల్): మాతాశిశు సంరక్షణే తన తొలి ప్రాధాన్యత అంశమని కొత్తగా డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పి. శాంతికళ అన్నారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో మాతృమరణాల సంఖ్య కాస్త ఎక్కువగానే ఉందని తెలిపారు. ఈ విషయమై ఇటీవల జిల్లా ప్రోగ్రామ్ అధికారులతో సమావేశమై చర్చించినట్లు చెప్పారు. దీంతో పాటు ఇటీవల ప్రారంభమైన ఎన్‌సీడీ 3.0 సర్వేలో భాగంగా బీపీ, షుగర్ రోగులపై దృష్టి సారించామన్నారు. ఈ మేరకు 18 ఏళ్లు దాటిన వారందరికీ బీపీ, షుగర్, క్యాన్సర్ పరీక్షలు చేయిస్తున్నామన్నారు. బీపీ, షుగర్ ఎంత మంది బాధపడుతున్నారో ముందుగానే తెలిస్తే వారు మందులు, జీవనశైలి ద్వారా వాటిని నియంత్రించి భవిష్యత్‌లో గుండెజబ్బులు, పక్షవాతం రాకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. దీంతో పాటు జిల్లాలో అధిక బరువుతో బాధపడుతున్న వారూ ఎక్కువగానే ఉన్నట్లు కనిపిస్తోందన్నారు. ఈ విషయం సర్వే పూర్తయ్యాక తెలుస్తుందని చెప్పారు. ప్రస్తుతం అన్ని రకాల పీహెచ్‌సీలు రౌండ్ ది క్లాక్ పీహెచ్‌సీలుగా మారాయని, వాటిలో రాత్రి వేళల్లో స్టాఫ్ నర్సులు ఉంటారని, అత్యవసరమైతే వైద్యులను పిలుస్తారన్నారు. ఏదైనా ప్రమాదాలు, ప్రసవాలు వస్తే ఎలాంటి వైద్యం అందించాలనే విషయమై ఇప్పటికే నర్సులకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి ఆర్మా అనే ప్రోగ్రామ్‌లో భాగంగా స్టాఫ్‌నర్సులు, ఏఎన్‌ఎంలకు కర్నూలు మెడికల్ కాలేజీలో శిక్షణ ఇవ్వబోతున్నట్లు వివరించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకుంటామని ఒక ప్రశ్నకు సమాధానంగా ఆమె పేర్కొన్నారు.

నీట మునిగిన ఆశలు

- చెరువు నీరు ముంచెత్తి దెబ్బతిన్న పంటలు
- ఆందోళనలో రైతులు


గుండుమల రహదారిలో నీట మునిగిన శనగ


డోన్ మండలం దేవరబండ చిన్న చెరువు నిండి దానిమ్మ తోటలో చేరిన నీరు

కోవెలకుంట్ల/డోన్: అధికారుల నిర్లక్ష్యంతో పంటలు నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

కోవెలకుంట్ల పట్టణ శివారులో జమ్మలమడుగు రహదారి పక్కన ఉన్న సుబ్బారెడ్డి కుంట నీరు పంట పొలాలను ముంచెత్తింది. ఇటీవల అధికారులు ఎస్సార్బీసీ 10వ బ్లాక్ కాల్వకు నీటిని అధికంగా విడుదల చేశారు. కాల్వ నీరు పక్కనే ఉన్న సుబ్బారెడ్డి కుంటలో భారీగా చేరింది. కుంటలోని నీరు పంట కాల్వల ద్వారా గుండుమలకు వెళ్లే రహదారిలో శనగ, జొన్న పంటలను ముంచెత్తాయి. రసాయన ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందులు, కలుపు నివారణ, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 30 వేలు వెచ్చించారు. మరో నెల రోజుల్లో పంట చేతికందాల్సిన తరుణంలో కాల్వ నీరు పైర్లను ముంచెత్తడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

- డోన్‌మండలంలోని దేవరబండ చిన్న చెరువు(కుంట)కు హంద్రీనీవా నీరు వదిలారు. తర్వాత అధికారులు చూసుకోకపోవడంతో ఆ చెరువు నిండి నీరు పక్కనున్న పంటపొలాలను ముంచెత్తింది. దీంతో దాదాపు దానిమ్మ, వేరుశనగ, కంది పంట దెబ్బతింది. ఈ విషయాన్ని బాధిత రైతులు తహసీల్దార్ నాగమణి దృష్టికి తీసుకెళ్లి ఆదుకోవాలని కోరారు.

అభివృద్ధి కోసం ఐదు గ్రామాల దత్తత

- కన్నమడకల గ్రామంలో ఇంటింటి సర్వే చేసిన ట్రిపుల్‌ఐటీడీఎం విద్యార్థులు
- డిగ్రీ చదివి నిరుద్యోగులుగా ఉన్నవారికి డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ


పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న ట్రిపుల్‌ఐటీడీఎం విద్యార్థులు, అధ్యాపకులు


కన్నమడకల గ్రామంలో ఇంటింటి సర్వే చేస్తున్న ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

కర్నూలు సిటీ: గ్రామీణ ప్రాంతాలను సమగ్రాభివృద్ధి చేసేందుకు ఉన్నత్ భారత్ అభియాన్ (యూబీఏ) ద్వారా విజ్ఞాన సంస్థలను భాగస్వాములను చేశారు. ఇందులో భాగంగానే కర్నూలు నగర శివారులోని జగన్నాథగట్టులో ఉన్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ (ట్రిపుల్‌ఐటీడీఎం) వారు జిల్లాలో ఐదు గ్రామాలను దత్తత తీసుకున్నారు. ఓర్వకల్లు మండంలోని కన్నమడకల, కేతవరం, ఓర్వకల్లు, కర్నూలు రూరల్ మండల పరిధిలోని పి.రుద్రవరం, నూతనపల్లె గ్రామాలను దత్తత తీసుకున్నారు. ఆదివారం ట్రిపుల్‌ఐటీడీఎం విద్యార్థులు వంద మంది కన్నమడకల గ్రామానికి చేరుకొని, ముందుగా అక్కడ ఉండే ప్రభుత్వ పాఠశాల ఆవరణాన్ని శుభ్రం చేశారు. తరువాత విద్యార్థులు బృందాలుగా ఏర్పాటై ఇంటింటికి వెళ్లి వివరాలను అడిగి నోట్ చేసుకున్నారు. పాఠశాల విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులతో మాట్లాడగా.. 8, 9, 10 తరగతులు చదువుతున్న పిల్లలు గణిత అంశాల గురించి చెప్పలేకపోయారు. మరి కొంత మంది పిల్లలు కనీసం ఆల్ఫాబెట్స్ సక్రమంగా చెప్పలేకపోయినట్లు గుర్తించి ఓ నివేదిక తయారు చేశారు. గ్రామంలో గ్రాడ్యుయేట్స్ ఉన్నప్పటికి వారంతా ఉద్యోగ అవకాశాలు లేక వ్యవసాయ పనులు చేస్తున్నట్లు గుర్తించారు. వీరందరికి డ్రోన్స్‌పై శిక్షణ ఇప్పించి, డ్రోన్ పైలెట్ లైసెన్స్ కూడా ఇప్పించనున్నారు. డ్రోన్ల కొనుగోలుకు కేంద్రం ప్రభుత్వం ఇస్తున్న రుణాలపై అవగహన కల్పించనున్నారు. పాఠశాల విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు స్కూల్ సమయం ముగిసిన తరువాత శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులు వెల్లడించారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీడీఎంకి చెందిన ఉన్నత్ భారత్ అభియాన్ కో-ఆర్డినేటర్ డా.నాగరాజు, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డా.మణి శంకర్ పాండే, స్టూడెంట్ అఫైర్స్ డీన్ డా.నరేష్‌బాబు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రెసిడెంట్ సుమంత్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల కోసం టీడీపీలో ఇరువర్గాల దాడి

- పలువురికి గాయాలు, ఇరువర్గాలపై కేసులు



గాయపడ్డ దుర్గ నాయుడు, రమణ గౌడ్

వెల్దుర్తి: ఉపాధి పనుల విషయంలో టీడీపీలోని ఇరువర్గాలు పరస్పరం దాడి చేసుకున్నాయి. మండల పరిధిలోని ప్యాక్షన్ గ్రామమైన మల్లెపల్లెలో జరిగిన ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో శేఖర్ గౌడ్ వర్గానికి నియోజకవర్గ టీడీపీ నాయకుడు, స్థానిక మండల నాయకుడు ఉపాధి పనులు చేసుకునేందుకు ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు తదితరావి ఇచ్చారు. కొంత కాలానికి తిరిగి దుర్గనాయుడు వర్గానికి సైతం ఆ పనులు చేసుకునేలా పురికొల్పారు. దీంతో ఇరు వర్గాల మధ్య వైరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం దుర్గ నాయుడు ఇళ్లపై శేఖర్ గౌడ్ వర్గం దాడి చేసి కొందరిని గాయపరిచింది. వెంటనే ప్రత్యర్థి వర్గం వారు శేఖర్ గౌడ్ వర్గీయుల ఇళ్లపై దాడి చేసి బైక్‌లు, వాకిళ్లు, మోటార్లు ధ్వంసం చేశారు. ఈఘటనలో గాయపడ్డ వారు ప్రస్తుతం కర్నూలులోని ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వారి ఫిర్యాదు మేరకు ఇరువర్గాలకు చెందిన 10 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

ఆనాటి జ్ఞాపకాలు మధురం


సమావేశంలో మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు

- ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ స్వర్ణోత్సవ వేడుకల్లో పూర్వ విద్యార్థులు


కళాశాల ప్రిన్సిపాల్ రఘురామాచార్యుల దంపతులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఆత్మకూరు: విద్యార్థి దశలోని జ్ఞాపకాలు, ముచ్చట్లు ఎప్పటికీ మరచిపోలేని మధురానుభూతులు అని ఆత్మకూరు ప్రభుత్వం జూనియర్ కాలేజీ పూర్వ విద్యార్థులు రిటైర్డ్ ఇస్రో శాస్త్రవేత్త మృత్యుంజయ రెడ్డి, విక్రమసింహా యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ విజయభాస్కర్‌రెడ్డి, రిటైర్డ్ బ్యాంక్ అధికారి మునీశ్వరయ్య అన్నారు. ఆదివారం కళాశాల స్వర్ణోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. తాము వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి ఇక్కడి గురువులే బోధనలే దోహదపడ్డాయన్నారు. ఈ కాలేజీ వాతావరణం తమను లక్ష్యం వైపు నడిపించిందని గుర్తు చేసుకున్నారు. అనంతరం ఎల్ఐసీ మేనేజర్ పాండురంగనాయక్, కర్నూలు ప్రభుత్వ వైద్యశాల చిన్నపిల్లల డాక్టర్ రఫిక్, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సాయిసుధీర్, విశ్వనాథం, కేవీ స్వాములు మాట్లాడుతూ ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతో పాటు క్రమశిక్షణ నేర్చుకున్నామన్నారు. ప్రస్తుత విద్యార్థులు కూడా క్రమశిక్షణ అలవర్చుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. స్నేహితులుగా ఒకరినొకరు సహాయ సహకారాలు అందించుకోవాలన్నారు. మంచి విద్యాబుద్ధులు నేర్పించిన ఈకాలేజీని ఎప్పటికీ మరువమన్నారు. అలాగే ఇక్కడ చదివే నిరుపేద విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఫండ్ ఏర్పాటు చేస్తామన్నారు.జూనియర్ కళాశాల స్థలదాత వెన్న రామకృష్ణారెడ్డి తనయుడు భోగిరెడ్డి మాట్లాడుతూ కరువు, కాటకాలకు నిలయమైన ఆత్మకూరులో కళాశాల ఏర్పాటుకు తన తండ్రి ఎంతో శ్రమించారన్నారు. ఆనాడు ఊరూరా తిరిగి చందాలు వసూలు చేసి కాలేజీ ఏర్పాటుకు లక్షరూపాయల డిపాజిట్ చేశారన్నారు. నేడు ఇక్కడ ఎంతో మంది చదువుకొని ఉన్నతంగా ఎదగడం చూస్తే సంతోషంగా ఉందన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు దంపతులను, 19974 నుంచి 2010 వరకు చదివిన పూర్వ విద్యార్థులను బ్యాచ్‌ల వారీగా సన్మానించారు. అంతకు ముందు స్థల దాత వెన్న రామకృష్ణారెడ్డి చిత్రపటానికి పూర్వ విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు, అధ్యాపకులు సలీం, సుజాత, మనోహర్, షేక్షావలి, సలీం, షేక్షావలి, రవికుమార్, బ్రహ్మానందం, శివలక్ష్మిరెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

'కంది' పోయింది..!

- జిల్లాలో 1.05 లక్షల ఎకరాల్లో కంది సాగు
- రైతులను వెంటాడిన తుఫాన్లు
- రాలిపోయిన పూత, పిందె
- పెట్టుబడులు నేలపాలు
- దిగుబడులపై ఆవిరైన ఆశలు



కోవెలకుంట్ల: కంది రైతుల ఆశలు ఆవిరయ్యాయి. విత్తనానికి ముందు వర్షాలు, వాతావరణం అనుకూలంగా మారటంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో విస్తారంగా కంది పంట సాగైంది. జిల్లాలోని 29 మండలాల పరిధిలో 90,585 ఎకరాల్లో కంది సాగు సాధారణ విస్తీర్ణం కాగా ఆయా మండలాల్లో లక్ష్యాన్ని మించి 1.05 లక్షల ఎకరాల్లో రైతులు కంది పంట వేశారు. ఇందులో డోన్ వ్యవసాయ సబ్ డివిజన్‌లో అత్యధికంగా 74,260 ఎకరాల్లో, నందికొట్కూరు సబ్ డివిజన్‌లో 10,735 ఎకరాల్లో, నంద్యాల డివిజన్‌లో 10,690 ఎకరాల్లో, కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో 8,495 ఎకరాల్లో, ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌లో 2,285 ఎకరాల్లో, ఆత్మకూరు డివిజన్‌లో 782 ఎకరాల్లో కంది పంట సాగైంది.

రాలిపోయిన పూత, పిందె

180 రోజుల పంటకాలం కలిగిన కంది పంటను జిల్లాలో రైతులు విస్తారంగా సాగు చేశారు. ఈ ఏడాది దిగుబడులు ఆశించిన స్థాయిలో వస్తాయని భావించారు. విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, సేద్యాలు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 25 వేల నుంచి రూ. 30 వేల వరకు వెచ్చించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వరుస అల్పపీడన ప్రభావాలతో గత ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. అధిక వర్షాలతో పూత, పిందె రాలిపోయాయి. అధిక తేమ కారణంగా మిగిలిన పైరును తెగుళ్లు ఆశించాయి. నాలుగు నెలల పాటు పైరును కంటికి రెప్పలా కాపాడుకోగా తుఫాన్లు కొంపముంచాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు రూ. 7 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయనుకుంటే తుఫాన్ల ప్రభావంతో ఎకరాకు 2 నుంచి 3 క్వింటాళ్ల దిగుబడులు వచ్చే పరిస్థితులు లేవని వాపోతున్నారు. ప్రభుత్వం పంట కోత ప్రయోగాలు నిర్వహించి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఎకరాకు రూ. 30 వేల పెట్టుబడి



ఎకరాకు రూ. 20 వేలు కౌలు చెల్లించి 10 ఎకరాల్లో కంది పంట సాగు చేశాను. సేద్యాలు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 30 వేలు వెచ్చించాను. పూత, పిందె దశలో తుఫాన్ల కారణంగా వర్షాలు కురిసి పూత, పిందె రాలిపోయి నష్టం వాటిల్లి పెట్టుబడులు నేలపాలయ్యాయి.

– సుధాకర్‌రెడ్డి, రైతు, కంపమల్ల

వర్షాలతో కంది పంటకు నష్టం



ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు కంది పంట సాగుకు అనుకూలంగా మారాయి. ఎకరా విస్తీర్ణంలో కంది పంట సాగు చేశాను. పైరు వివిధ దశల్లో ఐదు పర్యాయాలు క్రిమి సంహారక మందు పిచికారీ చేయాల్సి వచ్చింది. పైరు పూత దశలో ఉండగా తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలతో పూత, పిందె రాలిపోయాయి. ఎకరాకు 3–4 క్వింటాళ్లకు మించి దిగుబడులు వచ్చే పరిస్థితి కన్పించడం లేదు.

– మస్తాన్, రైతు, కోవెలకుంట్ల



ఎద్దుల క్షేమం కోరి..

పశువులను రైతులు ఎంతో జాగ్రత్తగా చూసుకుంటారు. ఇంట్లో కుటుంబ సభ్యుల్లా ప్రేమిస్తారు. అవి ఏమైనా అనారోగ్యానికి గురయితే తల్లడిల్లిపోతారు. ఈ క్రమంలో వాటి సంరక్షణకు రైతులు ముందు జాగ్రత్తలు తీసుకుంటారు. హాలహర్వి మండలం విరుపాపురం గ్రామంలో శివన్న అనే రైతు తన రెండు ఎద్దులకు దోమలు కుట్టకుండా దోమ తెరలు కట్టి ప్రేమ చూపుతున్నాడు. – ఆలూరు